# నా కథానికా రచన

రోజూ రాత్రిపూట భోజనాల దగ్గర గంటల తరబడి లోకాభిరామాయణం వేసుకోవటం మా ముగ్గురికీ అలవాటు. ఆ అలవాటు చొప్పునే నిన్న రాత్రి ఒక టాపిక్ లోంచి ఒక టాపిక్ లోకి కప్పగంతులేస్తూ చివరికి సాహిత్యంలో పడాము. మా మరది అంటాడు, 'పూర్వజన్మసుకృతం లేందే ఎవరికీ కవిత్వం అలవడదు' అని. నేనేమో 'మహాకావ్యాలు వ్రాయటానికైతే పూర్వజన్మ సుకృతం ఉండాలిగానీ, చిన్న చిన్న కథలు వ్రాయటం ఏమంత కష్టం కాదు, ఎవరైనా వ్రాయగలరు' అంటాను. మా మరది ససేమిరా ఒప్పుకోడు. ఇల్లాగే గంటన్నర గావుకేకలతో వాదన జరిగాక మావారు మా యిద్దరి మధ్యా రాజీ చేసేరు. అదేమిటంటే, రేపు రాత్రి లోపుగా ఇద్దరిలో ఎవరైతే ఒక కథ రాయగలరో, వారికి రెండోవారు క్షమార్పణ చెప్పుకుని తమ భావం మార్చుకోవాలి. సరే అంటే సరే అనుకున్నాము.

ఇంట్లో పని ముగించుకుని పక్కమీదికి జేరనే గాని, రేపు గెల్చే విధమేమిటా అని ఒకటే ఆలోచనతో సరిపోయింది. మా మరది నిరుద్యోగ డిపార్టుమెంటులో సెక్రటరీ. ఆ పదవి చాలక ఆయన ఇరవైనాలుగు గంటలూ కథలు వ్రాస్తూనే ఉంటాడు. ఆయన రాసిన కథలు పత్రికలవారికి అర్థం కాక తిరిగి వచ్చేస్తూ వుంటాయి. అయితే నేం ఒక్కొక్క కథ తిరిగివస్తూ ఉంటే మరింత ఉత్సాహంతో వ్రాసేస్తూనే ఉంటాడు. అటువంటి జగజెట్టితో నేను పందెం వేసుకోటం అనుచితం అని తోచింది కానీ, ఇంతలో అభిమానం అడ్డువచ్చింది. ఇన్ని పత్రికలు, పుస్తకాలు చదువుతున్నాం గదా, ఒక్కటంటే ఒక్కటి ఏదో వ్రాయలేకపోతానా అని ధీమా. ఏమి రాద్దామా అని ఆలోచించటం మొదలు పెట్టాను. కానీ ఏదీ అంతు చిక్కటం లేదు. ఆలోచించి, ఆలోచించి బుర్ర వేడెక్కిపోయి, ఒక్క కథ అన్నా అల్లలేని నా అశక్తతను నిందించుకుంటూ కళ్ళుమూశాను.

“అమ్మగారూ, అమ్మగారూ” అని పనిమనిషి పిలుస్తుంటే - ఉలిక్కిపడి లేచాను. తెల్లగా తెల్లవారింది. అయ్యో, ఆలస్యమయిందే అని లేచి, రోజువారీ కార్యక్రమంలో లీనమయాను. మాటి మాటికీ రాత్రిసంగతే గుర్తుకువచ్చి, కథావస్తువు గురించి మనస్సులో మెదుల్తూంటే ఆ భావాలని బలవంతంగా నెట్టేసి పని చేసుకోవాల్సి వచ్చింది. మిన్ను విరిగి మీదపడ్డా వంటపని తప్పదుగా! ఎనిమిదిగంటలకి వంటఇంట్లో ప్రవేశించి మళ్ళీ బైటపడేసరికి గోడగడియారం టంగు టంగున పన్నెండుకొట్టింది.

## యస్. యస్. ప్రసూన

పిల్లలు స్కూలుకి వెళ్ళేరు, శ్రీవారు మామూలు డ్యూటీ బుజాన వేసుకుని ఆఫీసుకు దయచేసేరు. ఇదే నాకథ వ్రాసేటందుకు అనుకూలమైన సమయం అనుకుని, కలం కాగితాలు ముందేసుకూచున్నాను మళ్ళీ రాత్రి ఆలోచనే ఏమి కథ వ్రాయను? ఇదివరలో చదివిన కథలన్నీ ఓమాటు మనస్సులో తిరగేసుకున్నాను. ఊహూ! ఒక్కటీ గుర్తుకు రావటం లేదు. పోనీ మానేద్దామా అనుకున్నా. ఛీ. ఇంత మనోధైర్యం లేకపోవట మేమిటి? పట్టుదలతో కృషి చెయ్యాలి గాని, అని మళ్లీ మనస్సుని దిటవు పర్చుకున్నా. ఇంతలోనే మెరుపులాంటి ఆలోచన ఒకటి వచ్చింది. అటువంటి ఆలోచన వచ్చినందుకు నన్ను నేనే అభినందించుకున్నాను. అదేమిటంటే- నాకు చిన్నప్పటినుంచీ జానపద కథలంటే చాల ఇష్టం. అందుకని ఒక రాజకుమారుడు, రాజకుమార్తెని సృష్టించి, వారిద్దరు ప్రేమించుకు నేట్టు చేసి వారి ప్రేమ సఫలత కోసం వారిచేత అద్భుతమైన సాహసకృత్యాలు చేయిస్తే సరి; ఓ మంచి కథ తయారవుతుంది అనుకున్నాను.

మొదలు పెట్టటం ఎట్లాగా అని మళ్ళీ ఆలోచన. ముందు రాజకుమార్తెని, రాజకుమారుణ్ణి ఒకరికొకర్ని పరిచయం చేద్దాం అనుకున్నా. ప్రేమికులు కలుసుకునేది సాధారణంగా వెన్నెల రాత్రులని చాలా మంది కవులు వ్రాస్తారు. రాజోద్యానవనంలో రాజకుమారి నిద్రపట్టక విహరిస్తూ వుంటుంది. అది చీకటిరాత్రి. ఆకాశమంతా విరగబూసిన మల్లెపందిరిలా వున్నది. వనంలో పుష్పరాజాలన్నీ తమ తమ సౌరభాల్ని పవనకుమారునికి కానుకగా ఇచ్చే శుభసమయం.

ఇల్లా కాస్త మొదలెట్టానో లేదో, “ఏం చేస్తున్నావమ్మా” అంటూ పక్క ఇంటి అవ్వగారు ప్రత్యక్షం. చచ్చాంరా బాబూ అనుకున్నా. ఇంకేం వుంది. గుండెల్లో రాయి పడి, ఐడియాకి బ్రేకు పడింది.

లేని నవ్వు తెచ్చుకుని “రండి బామ్మగారూ” అని ఆహ్వానించాను.

“ఏం చేస్తున్నావమ్మా లలితమ్మా” అని ఆమె అడుగుతుంటే ఏమి చెప్పాలో తోచలేదు. చేస్తున్న పని చెప్పినా లేక ఏదన్నా చదువుతున్నానని చెప్పినా ఆమె వూరుకుంటుందా? రామాయణ, మహాభారతాలు తప్ప ఇంకేవీ మన స్త్రీలు చదవరాదనీ, అల్లా ఇంకేవయినా చదివినవాళ్ళందరూ చెడిపోయినవాళ్లకింద లెక్కనీ ఆమె అభిప్రాయం. అందుకని, “ఏమీ లేదు బామ్మగారూ. మా తమ్ముడు క్షేమం తెలిసి చాలా రోజులయింది. వాడికో వుత్తరం వ్రాస్తున్నాను” అని సర్ది చెప్పేను.

ఇహ ఆమెగారు తమ రామాయణం విప్పేరు. వాళ్ళింట్లో సంగతులు, వీరింట్లో తగూలు ధారాపాతంగా చెప్పుకుపోతున్నారు. నేను 'వూ' కొడుతున్నా నన్నమాటే గానీ, ఈవిడని ఎల్లా వదిలించుకోనా అని ఆలోచిస్తున్నాను. ఉన్నట్టుండి, “ఇది విన్నావుటమ్మా లలితా, ఎంత విపరీతమో!

కలియుగమమ్మా తల్లీ; కలియుగం మండి పోతోంది!" అంటూ ఏదో ప్రమాదకరమయిన వార్త చెప్పబోయారు. నేనూ ఏమిటా అని విస్తుపోయి "ఏమిటి బామ్మగారూ" అని అడిగేను.

"నువ్వు వినలేదూ, అయ్యో పిచ్చితల్లీ! లోకమంతా కోడయి కూస్తున్నదమ్మా! ఏమిటో నీ సంసారం పిల్లలూ తప్ప మరోటి అక్కర్లేదు, సత్తెకాలపు పిల్లవి." అని నన్ను ఉబ్బేసి, అతి రహస్యం చెప్తున్నట్టు చెవిదగ్గరగా వచ్చి, "కొత్తగా వూళ్ళోకి రాలా, హెడ్డు గుమాస్తాగారు, వారి కోడలుట! మొగాడిలాగా బెజవాడలో ఉద్యోగం చేస్తున్నదిట! అయ్యో... అయ్యో ఇవేమన్నా బాగుపడే బుద్ధులేనా చెప్పు" అని రెండు బుగ్గలూ నొక్కుకున్నారు. నాకు ఈ సంగతి ఇదివరకే తెలుసు. కానీ, ఆమెముందు తెలిసినట్టు ప్రవర్తించటం మంచిదిగాదు. పైగా ఇటువంటి విషయాలు ఆమెకి నచ్చచెప్పటానికి ప్రయత్నించామో, ఇహ ఇటు ఏడుతరాలు అటు ఏడుతరాల వారినీ దీవించి మరీ వెళ్తుంది. ఆమె చెప్పినవన్నీ విని వూరుకోటమే మంచిది. నేనేమీ మాట్లాడలేదు.

తన పాచిక పారలేదనుకున్నది కాబోలు "వెళ్ళొస్తా తల్లీ, మళ్ళీ ఈ సంగతి ఎవరితోనూ అనకు సుమా" అని ఆమె నిష్క్రమించారు.

బతికేంరా బాబూ అని మళ్ళీ కలం తీసుకున్నాను. ఇంతలో గదిలోంచి తేలు కుట్టినట్టుగా ఒక్క గావుకేక పెట్టేడు మా మరది. ఏమిటో అని పోయి చూద్దును కదా, పొట్టపట్టుకుని నవ్వుతున్నాడు.

"మీ సంభాషణ అప్పుడే అయిందేం?" అంటూ మళ్ళీ నవ్వడం మొదలుపెట్టేడు. అప్పటికి తెలిసింది. "అవును గానీ వదినా రోజుకి ఇరవైసార్లయినా నీ ఆదర్శాలు ఆశయాలు వల్లెవేస్తూవుంటావు, మరి ఒక్క ముసలిఆమెకే జవాబు చెప్పలేకపోయావేం? మంచి ఆదర్శవంతురాలవేలే" అంటూ ఎద్దేవా మొదలుపెట్టేడు. నాకు కోపం వచ్చింది.

"అవునులే ఎప్పుడు వీలుచిక్కుతుందా హేళనచెయ్యటానికి అని కనిపెట్టుకూచుంటావులే."

ఇంత చదువున్నా నే చెప్పేది నీకే అర్థం కాదయ్యే; ఇహ ఆమెగారికా చెప్పేది. మన మాట అర్థంచేసుకునేపాటి సంస్కారం లేనివాళ్ళతో మనం వాదించేకంటే నోరుమూసుకూచోటమే మంచిది. నువ్వు నవ్వినంతమాత్రాన నా ఆదర్శాలకేమీ లోటు రాలేదులే" అని కోపంగా ఇవతలకి వచ్చేసేను.

"వదినా, వదినా" అంటూ మళ్ళీ వెనకాలే వచ్చాడు.

"కథ రాద్దామంటే ఒకటే గొడవ. వెళ్ళు అవతలకి" అని కసిరేను.

"వదినా కాస్త విను" అన్నాడు.

"ఏమిటో చెప్పరాదూ" అన్నాను.

"వదినా కాస్త కాఫీ నా మొహాన పోశావా అంటే, మళ్ళీ ఏడు గంటలదాకా నీతో మాట్లాడితే వొట్టు" అన్నాడు.

టైము చూస్తే రెండున్నర అయింది. నాకూ కాస్త కాఫీ తాగితే బాగుండు నని పించి స్టౌ వెలిగించాను.

కాఫీ అయి మళ్ళీ కాగితాలు ముందేసుకూచున్నానన్నమాటేగానీ, ఇందాకటి భావాలన్నీ గజిబిజిగా అల్లుకుపోయాయి. ఏ వొక్కటీ విడదీసి ఒక రూపం కల్పించలేక తికమకపడుతున్నాను. ఏదో భావం మెరుపులాగా మెరిసి, పట్టుకోబోయేసరికి మరుపులో మాయమవటం ఇల్లాగ సతమతమయి, ఒకో్క భావాన్ని ఏర్చి కూర్చుకుని, చివరికి కథ వ్రాయటానికి ఉపక్రమించాను. ఇంతలో ఆఫీసుప్యూన్ ప్రత్యక్షం. కాఫీ రెడీగానే ఉన్నదిగా! ఫ్లాస్కు ఇచ్చి "ఇదిగో వీరాస్వామీ కాఫీ అయ్యగారికి ఇచ్చి అల్లా మార్కెట్టుకి వెళ్ళి కూరలు పట్రా" అని సంచీ రెండు రూపాయలనోటు అతనికి అందించి, కుర్చీదగ్గరికి వెళ్ళేను. కొంతదూరం వెళ్ళి తిరిగివచ్చాడు వీరాస్వామి.

"ఏమిటోయ్ మళ్ళీ ఎందుకు వచ్చావ్?"

"తమరికండీ అయ్యగోరు ఓ చీటీ ఇచ్చినారండీ" అంటూ ఓ చీటి ఇచ్చి వెళ్ళిపోయాడు. అయ్యగార్లకి చీట్లు ఇవ్వటం, జమాన్లకి తీసుకురావటం తప్ప మరోపని లేదనుకుంటూ చీటీ విప్పిచూసుకున్నాను. ఏమున్నది! అర్జంటుగా కాంపువెళ్ళాలి, హోల్డాలూ అవీ సిద్ధపరిచి, వంట వేగిరం కానీయి. అయిదుగంటల బండికే వెళ్ళాలి" అని వున్నది అందులో. అప్పుడే గడియారం చిన్నముల్లు నాలుదగ్గరికి రాబోతున్నది. ఇంకేమున్నది. కథ కంచికి నేను వంట ఇంట్లోకి.

ఇదంతా మా మరది గది కిటికీలోంచి చూస్తున్నాడు గాబోలు "వదినా అప్పుడే కథ వ్రాశావా ఏమిటి ఏదీ ఇల్లా ఇవ్వు" అంటున్నాడు, వచ్చేనవ్వు దాచుకుంటూ.

"అవునవును నీ మల్లే రోజల్లా వాలుకుర్చీకి అతుక్కుపోయి, వదినగారు క్రమం తప్పకుండా కాఫీ ఫలహారాలు అందిస్తూంటే, కమ్మ కమ్మగా సేవించి, శ్వేత కాగితాలు తగలేస్తూ కూచున్న వాళ్ళు రోజుకి ఒక్క కథేం ఖర్మ, పదయినా రాస్తారులే" అని సమాధానానికయినా ఎదురుచూడకుండా వంటఇంట్లోకి వచ్చిపడ్డాను. నిజంగా మీరే చెప్పండి, నేనే ఓడిపోయానంటారా? ఇన్ని అవాంతరాలు వస్తే ఎంత చెయ్యితిరిగిన రచయిత అయినా కథ వ్రాయగలడా? ఇంతకీ నేను వోడిపోయానన్న విచారంకంటే, రాజకుమారుడికి చాలా అన్యాయం జరిగిందని విచారంగా వున్నది. రాజకుమారుడు అజ్ఞాతంగానే ఉండిపోయాడు. ★

